సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



నృసింహుని సేవలో ఆర్డీవో

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని గురువారం ఆర్డీవో నరసింహమూర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రధాన, అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కృష్ణాష్టమి పూజలు



ధర్మపురి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గురువారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని బలరామకృష్ణులకు, వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీకి 59 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



దిగువకు వెళ్తున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఎస్సారెస్పీ నిండు కుండలా మారింది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి 49,960 క్యూసెక్కుల నీటిని గోదావరినదిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 59,078 క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలకు గాను ప్రస్తుతం అదే స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యం కొనసాగుతుంది.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల వినూత్న నిరసన



కృష్ణుని రూపంలోని కేసీఆర్ చిత్రానికి మొక్కుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

జగిత్యాలటౌన్: తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని కోరుతూ దీక్షలో ఉన్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎస్‌ఎస్‌ఏ జేఏసీ సభ్యులు కృష్ణాష్టమిని పురస్కరించుకుని గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద దీక్షా ప్రదేశంలో కృష్ణుని రూపంలో కేసీఆర్ చిత్రపటాన్ని చిత్రించి ఆ రూపానికి సాష్టాంగ ప్రమాణం చేస్తూ తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో జీవితాలు వెల్లదీస్తున్న సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్(జగిత్యాల): సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులు 23 మంది, ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులు 29 మందికి గురువారం చెక్కులు అందజేసి మాట్లాడారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాల ద్వారా ప్రతి వ్యక్తి ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. బీర్‌పూర్ మండలానికి ప్రత్యేకంగా కస్తూరిబా బాలికల విద్యాలయంతో పాటు ప్రత్యేక అంబులెన్స్ మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, పాత పద్మ, గుర్రాల రాజేందర్‌రెడ్డి, నల్ల మహిపాల్‌రెడ్డి, సొల్లు సురేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. కాగా విండో వైస్ చైర్మన్ పల్లపు బాపిరాజు ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలంఒడ్డెరకాలనీ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

డబుల్ రోడ్డు పనులు షురూ



రోడ్డుకు ఇరువైపులా చదును చేసిన దృశ్యం

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామం నుంచి నిజామాబాద్ జిల్లా కోనాపూర్ వరకు డబుల్ రోడ్డు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. కోనాపూర్ నుంచి భూషణరావుపేట గ్రామం మీదుగా కథలాపూర్ మండలకేంద్రం వరకు డబుల్ రోడ్డు కోసం మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మండలానికి చెందిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి విన్నవించగా, రూ. 6 కోట్లు గత నెలలో మంజూరు చేసిన విషయం తెలిసిందే. టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభం కావడంతో రెండు గ్రామాల్లోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సింగిల్‌రోడ్డుకు ఇరువైపులాల పిచ్చిమొక్కలు తొలగింపు, భూమి చదును చేస్తుండటంతో రోడ్డు పనులు తొందరగానే పూర్తవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



జగిత్యాలలోని వెంకటాద్రినగర్ ఏరియాలో నిలిచిన వర్షపు నీరు



మెట్‌పల్లిలోని ఎస్సారెస్పీ కాలనీలో వరద



కోరుట్లలోని ఆదర్శనగర్‌లో నీటి నిల్వలు

ముంపు.. కంపు

- చిరుజల్లులకే కాలనీలు జలమయం
- ఇళ్లలోకి చేరుతున్న వర్షపునీరు
- నీటితోపాటే వస్తున్న పాములు, తేళ్లు
- ప్రాణభయంలో మున్సిపల్‌వాసులు
- పారిశుధ్య లోపంతో ప్రబలుతున్న వ్యాధులు
- ఐదు పురపాలికల్లోనూ ఇదే దుస్థితి

కోరుట్ల: గతజూలై 6, 7, 8వ తేదీల్లో కురిసిన భారీవర్షాలతో ఐదు మున్సిపాలిటీల్లోని కొన్ని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా జగిత్యాల బల్దియాలోని వెంకటాద్రినగర్‌కు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కోరుట్ల గంగంపేట, ప్రకాశం రోడ్డు ఏరియాల్లోని కొన్ని నివాసాలు వరదలో మునిగాయి. మెట్‌పల్లి మున్సిపల్ ఎస్సారెస్పీ కాలనీ, సుల్తాన్‌పురా వరద దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ధర్మపురిలోని గిరికలకాలనీలో వర్షపు నీరు నిలిచి పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాయికల్ చెరువుకట్ట సమీప ఇళ్లను వరదనీరు ముంచెత్తింది.

సరిగ్గా నెల తర్వాత..

- సరిగ్గా నెలరోజుల తర్వాత మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి.
- ఐదు మున్సిపాలిటీల్లోని అవే కాలనీలు మళ్లీ వరద ముంపునకు గురవుతున్నాయి.
- ఇళ్లలోకి నీరు వచ్చిచేరుతోంది.
- నివాసాల నుంచి అడుగు బయటకు వేయాలంటే కుదరని దుస్థితి నెలకొంది.
- నెలరోజులుగా అధికారులు, ప్రజాప్రతినిధుల హడావుడి తప్ప ముంపు బాధితులకు ఇంకా విముక్తి కలుగనేలేదు.

ముంపు నివారణ చర్యలేవి..?

వరద ముంపు నివారణకు చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికార యంత్రాంగం తూతూమంత్రంగా వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి. భారీవర్షాలు కురిసి కాలనీలు, ఇళ్లు నీట మునిగి, రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగితే.. పరిస్థితిని చక్కదిద్దాల్సిన అధికారులు పెద్దగా స్పందించడంలేదు.



మెట్‌పల్లిలోని సుల్తాన్‌పుర కాలనీలో నీరు

- జగిత్యాలలో ఇరుకు కల్వర్టులు, చిన్న డ్రైనేజీల విస్తరణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
- కోరుట్లలో ప్రకాశంరోడ్డు, ముత్యాలవాడ ఏరియాల్లో వర్షపు నీరు చేరకుండా డ్రైనేజీలు విస్తరించి.. కంచరకుంటలో పూడికతీసి, వర్షపునీరు కుంట నుంచి దిగువన ఉన్న కాలనీల్లోకి రాకుండా కాలువ తవ్వినా.. పెద్దగా ఫలితం లేకుండాపోయింది.
- జగిత్యాల మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లో ఇదివరకు ఇరుకైన నాలాలు ఆక్రమణలకు గురికావడంతోపాటు డ్రైనేజీలు చిన్నగా ఉండటంతో వర్షపు నీరు నిలిచిపోతోందని అధికారులు గుర్తించారు. కానీ, వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయడంలేదు.
- మెట్‌పల్లిలో మున్సిపల్ తరఫున పెద్దచెరువు నీటి మళ్లింపు పనులు చేపట్టిన దాఖలాలు లేనేలేవు. ఎస్సారెస్పీ కాలనీలోనూ ముంపు నివారణపై దృష్టి సారించడంలేదు.

సమస్యకు పరిష్కారం ఏమిటి?

- జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఏటా ఎదురవుతున్న వరద ముంపు నివారణకు డ్రైనేజీలు, కల్వర్టులు విస్తరించాలి.
- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్‌లో వాగు, చెరువులు, కుంటలను ఆనుకుని, లోతట్టు ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి.
- ఇలాంటి ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లో వరదను మళ్లించే ఏర్పాట్లు చేయాలి. కొత్త నిర్మాణాలు ఆపేయాలి.
- వరద ధాటికి మట్టి, సీసీ రోడ్లు కోతకు గురవకుండా, గుంతలు పడకుండా, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.
- బల్దియాల విస్తరణ ద్వారా ఒర్రెలు, నాలాలు ఆక్రమణకు గురయ్యాయి.
- వీటిని గుర్తించి సరిచేస్తే లోతట్టు కాలనీల్లో నీరు నిల్వదు.
- 'అన్నివార్డులకు సమానంగా నిధులు' అనే ఆనవాయితీని పక్కనబెట్టి.. వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి నష్టాన్ని పూడ్చాలి.

ముంపు ప్రాంతాలు ఇవే..

బల్దియా	ముంపు ప్రాంతం
జగిత్యాల	చిలుకవాడ, గోవిందుపల్లెరోడ్డు, వెంకటాద్రినగర్, కృష్ణానగర్, బైపాస్‌రోడ్డు, నాలాలు
కోరుట్ల	ముత్యాలవాడ, ప్రకాశంరోడ్డు, గంగంపేట, కల్లూర్‌రోడ్డు రైల్వేబ్రిడ్జి
మెట్‌పల్లి	సుల్తాన్‌పురా, చైతన్యనగర్, ఎస్సారెస్పీ కాలనీ
ధర్మపురి	అయ్యప్పస్వామి టెంపుల్ ఏరియా ఖాళీ స్థలాలు, గిరికలకాలనీ
రాయికల్	చెరువుకట్ట ప్రాంతం

జగిత్యాలకు వెళ్లలేని దుస్థితి



భారీ వర్షాలతో జగిత్యాలకు వెళ్లే రోడ్లు నీట మునుగుతున్నాయి. వరద తగ్గే వరకూ పట్టణంతో మాకు సంబంధాలు తెగిపోతున్నయి. ప్రతీ అవసరానికి ఇబ్బందులు పడుతున్నం. రోడ్డుపై నీరు చేరకుండా చర్యలు చేపట్టాలి.
– భరత్‌గౌడ్, వెంకటాద్రినగర్, జగిత్యాల

మూడ్రోజులుగా నీటిలోనే..



ఏటా వర్షాకాలంలో నీటి ముంపులోనే ఉంటున్నం. ఇంటినుంచి అడుగు బయట పెట్టలేం. రోడ్డుపై ఎక్కడ గుంతలున్నాయో.. ఎక్కడ డ్రైనేజీలు ఉన్నయో తెలియదు.
– పెంట అశోక్, ప్రకాశం రోడ్డు, కోరుట్ల

వర్షాలతో భయమే



భారీవర్షాలు కురిసినప్పుడల్లా పెద్ద చెరువు నుంచి వదిలిన నీరు మా కాలనీలో చేరుతుంది. ఇళ్లలోనూ చేరి బిక్కుబిక్కుమంటున్నం. నీళ్లలో పాములు, తేళ్లు వస్తుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నం.
– కుత్బుద్దీన్, సుల్తాన్‌పుర, మెట్‌పల్లి

చర్యలు తీసుకుంటున్నాం



ప్రజలకు వరద ముంపుతో ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో తగిన చర్యలు తీసుకుంటున్నాం. డ్రైనేజీలు, కల్వర్టులను విస్తరించేందుకు ప్రతిపాదించాం. ఏవైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకు రండి. వెంటనే పరిష్కరిస్తాం.
– రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

పోలీసుల బందోబస్తు



తిమ్మాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో కొద్దిరోజులుగా సీపీఎం నాయకులు నిరుపేదలతో గుడిసెలు వేయించే ప్రయత్నం చేయగా గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో గురువారం సదరు ప్రభుత్వ భూమి వద్దకు పెద్ద ఎత్తున నిరుపేదలు రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలోకి ఎవరూ రాకుండా భారీబందోబస్తు ఏర్పాటు చేశారు.

విపక్షాల దుష్ప్రచారం నమ్మొద్దు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్‌పై విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌కి చెందిన తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్కా కమలాకర్ నేతృత్వంలో సుమారు 100మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికలలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు మళ్లీ పట్టం కడుతారని జోస్యం చెప్పారు. విపక్షాల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యకర్తలే తన బలమని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌ను భారీ మేజార్టీతో గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజనఆదిరెడ్డి, బద్దం నర్సారెడ్డి, పాలేపు దిలీప్, బెజ్జారపు లికితసాయికుమార్, కాటిపెల్లి ఆదిరెడ్డి, మెర్గాడ్ బాబన్న, ఎడ్ల సురేష్, కుషన్‌పెల్లి రజనీకాంత్, ఆరే శ్రీనివాస్, బెజ్జారపు సాజన్, సంజీవ్, వినోద్, నరేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దయచేసి వినండి...

సిరిసిల్ల ట్రెయిన్

21 కి.మీ దూరంలో ఉన్నది!

- వడివడిగా మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైన్ పనులు
- ఇటీవల సిద్దిపేట వరకు వచ్చిన రైలు
- త్వరలో సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లో స్టేషన్లు
- ప్లాట్‌ఫాంలు, భవనాలు, గదుల నిర్మాణానికి టెండర్లు
- ఏడాదిలోగా పూర్తి చేసేందుకు చర్యలు



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో రైల్వే పనులు ఊపందుకున్నాయి. కొత్తపల్లి– మనోహరాబాద్ లైన్ పనులు వడివడిగా సాగుతున్నాయి. ఈ మార్గంలో ఇప్పటికే సిద్దిపేట వరకు రైలొచ్చింది. మిగిలిన రూట్లలోనూ పనులు స్పీడందుకున్నాయి. సిద్దిపేట తర్వాత గుర్రాలగొంది, చిన్నలింగాపూర్, సిరిసిల్ల స్టేషన్ల నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే టెండర్లు జారీ చేసింది. ప్లాట్‌ఫాంలు, భవనాలు, గదులు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, విద్యుత్ యార్డు తదితర పనుల కోసం టెండర్లు జారీచేశారు. మొత్తం టెండరు విలువ రూ. 5,30,27,277గా అధికారులు పేర్కొన్నారు. ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు టెండరు ముగింపు గడువుగా తెలిపారు. పనులు ఏడాదిలోగా పూర్తి చేయాలని టెండరులో సూచించారు.

21 కి.మీ. దూరంలో పాత కరీంనగర్..

సిరిసిల్ల–సిద్దిపేట మధ్యలో 30 కి.మీ దూరానికి ట్రాక్ వేసేందుకు దాదాపు రూ.440 కోట్ల వ్యయంతో జనవరిలోనే దక్షిణ మధ్య రైల్వే బిడ్డింగులు పిలిచింది. తాజాగా సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లలోనూ స్టేషన్ నిర్మాణాలకు దక్షిణ మధ్య రైల్వే టెండర్లు పిలవడంతో ఈ మార్గంలో జరుగుతున్న పనుల వేగానికి నిదర్శనం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి –మనోహరాబాద్ రైల్వేలైను ప్రస్తుతం సిద్దిపేట వరకు పూర్తయింది. ఇటీవల సిద్దిపేటను రైలు కూడా పలకరించింది. సిద్దిపేట తర్వాతి స్టేషన్ గుర్రాలగొంది కేవలం 10 కి.మీ దూరంలో ఉంటుంది. గుర్రాలగొంది– చిన్నలింగాపూర్ మధ్య దూరం 11 కి.మీ. చిన్నలింగాపూర్–సిరిసిల్ల మధ్య 9.కి.మీ దూరం వస్తుంది. గుర్రాలగొంది సిద్దిపేట జిల్లా కాగా, చిన్నలింగాపూర్ సిరిసిల్ల జిల్లాలో ఉంటుంది. ఈ లెక్కన కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే మార్గం పాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రవేశించేందుకు కేవలం 21.కి.మీల దూరంలో ఉంది.

77 కి.మీ. మేర పూర్తయిన మార్గం..

మనోహరాబాద్ –కొత్తపల్లి (కరీంనగర్) వరకు మొత్తం 151.36 కిలో మీటర్లు బ్రాడ్‌గేజ్‌లైన్. ఈ మార్గంలో ప్రస్తుతం సిద్దిపేట స్టేషన్ (77కి.మీ) వరకు లైన్ పూర్తయింది. ఇక్కడి నుంచి దాదాపు 30 కి.మీ దూరంలో ఉన్న సిరిసిల్ల స్టేషన్ (106.88 కి.మీ) వరకు ప్రస్తుతం పనులు వేగంగా నడుస్తున్నాయి. అక్కడ నుంచి కరీంనగర్ వరకు (151.36 కి.మీ) అంటే దాదాపు 44.48 కి.మీ వరకు ట్రాక్ పనులు సాగాలి. ఇవి 2025 మార్చి వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిసిల్లలో కావాల్సిన భూసేకరణకు అధికారులు ఇప్పటికే పచ్చజెండా ఊపారు. దక్షిణ మధ్యరైల్వే అడిగిన భూమిని అటవీ భూమిని ఇచ్చేందుకు ఇటీవల సిరిసిల్ల కలెక్టర్ అనుమతించారు. భూసేకరణ విషయంలో రైల్వే అధికారులతో సిరిసిల్ల–కరీంనగర్ కలెక్టర్లు కూడా పలుమార్లు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ మార్గం పూర్తయితే జగిత్యాల, పెద్దపల్లి వాసులకు ఢిల్లీ, హైదరాబాద్ వెళ్లేందుకు రైలు ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.

ప్రాజెక్టు నేపథ్యం ఇదీ..

వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట ప్రజలకు రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2006–07లో 151 కి.మీ కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వే లైన్ కోసం రూ.1,167 కోట్ల అంచనా వ్యయం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తర్వాత ఈ మార్గం ఆర్థికంగా భారమని చెప్పి రైల్వే శాఖ సుముఖత చూపలేదు. మొత్తం బడ్జెట్‌లో 1/3 వంతు ఖర్చుతోపాటు 100 శాతం భూమిని సేకరించి ఇవ్వడం, ఈ మార్గంలో ఐదేళ్లపాటు వచ్చే నష్టాలను భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. దీంతో 2016లో ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కింది. ఈప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

కొత్తపల్లి–మనోహరాబాద్ మార్గం విశేషాలు

- మార్గంలో విస్తరించి ఉన్న జిల్లాలు: సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్
- మార్గాన్ని ఆనుకొని ఉన్న గ్రామాలు: 70
- ఈ రూట్‌లో మొత్తం రైల్వే స్టేషన్లు :15
- పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలు: వేములవాడ, కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలు.
- మొత్తం పొడవు 151.36 కి.మీ.
- మెదక్ జిల్లాలో 9.30 కి.మీ.
- సిద్దిపేట జిల్లాలో 83.40 కి.మీ.
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో 37.80 కి.మీ.
- కరీంనగర్ జిల్లాలో 20.86 కి.మీ.
- ఇప్పటి వరకు పూర్తయిన మార్గం 77 కి.మీ.

ఒక్క టవర్ రూ.అరకోటి!

- చురుగ్గా సాగుతున్న పనులు
- ఇబ్బందులు లేకుండా కరెంటు సరాఫరా
- పర్యవేక్షిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ




కొత్త టవర్ పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ

కోరుట్ల/జగిత్యాలఅగ్రికల్చర్: వరద ప్రభావంతో దెబ్బతిన్న ఒక్క టవర్ ఖరీదు అక్షరాలా రూ.అరకోటి అంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలోని వాగును ఆనుకుని ఉన్న ఈహెచ్‌టీ టవర్ పనులు చరుకుగా సాగుతున్న క్రమంలో కొత్త టవర్‌కు ఎంత తక్కవ అనుకున్నా రూ.50 లక్షల ఖర్చు కావడం గమనార్హం. రెండు రోజులుగా పాత టవర్‌ను ఆనుకుని కొత్త టవర్ ఏర్పాటు పనులను ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాతారం వాగు వద్ద ఉండి పనులు వేగంగా పూర్తి చేయించారు. ప్రస్తుతం కొత్త టవర్ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని ఎస్ఈ తెలిపారు. మరో రెండు రోజుల్లో పాత టవర్ నుంచి విద్యుత్ వైర్లను కొత్త టవర్‌కు మార్చుతామని, వర్షంతో కొంత అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు. ఈహెచ్‌టీ టవర్ మార్చుతున్న క్రమంలో కోరుట్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని కోరుట్ల, గోధూర్, కథలాపూర్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరాఫరాలో లోపాలు ఉండవచ్చని మొదట ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరాఫరా కొనసాగుతుండటం విశేషం. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయడంతో పాటు వాగు నీటి ఉధృతి మళ్లీ టవర్‌ను చేరకుండా ఉండేందుకు రిటేయినింగ్ వాల్ ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిసింది.

ఏటా గండి పెట్టుడే..

గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో ఇందిరమ్మకాలనీకి వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు అధికంగా పడినప్పుడు ఎగువ భాగం నుంచి వచ్చే వరద నీళ్లు లక్ష్మీపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగా ప్రవహించి దిగువన ఉన్న భీంరాజ్‌పల్లి చెరువులోకి వెళ్తాయి. ఈక్రమంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడ మినీ వంతెన నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. కానీ స్థానిక పాలకులు సీసీ రోడ్డుతోపాటు వరద నీరు వెళ్లేందుకు పైపులు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో వర్షం పడి వరద పోటెత్తిన ప్రతిసారి పైపు తొలగించి రోడ్డుకు గండి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇలా చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డును తవ్విన దృశ్యం

క్లుప్తంగా

యువకుడి నిజాయితీ



సీఐ నటేశ్‌కు డబ్బు అందజేస్తున్న రాజేశ్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ ప్రాంతం ఏటీఎంలో దొరికిన డబ్బును ఓ యువకుడు పోలీసులకు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. జిల్లా కేంద్రం పోచమ్మవాడకు చెందిన పోతు రాజేశ్ వెల్డింగ్‌షాపులో పనిచేస్తాడు. గురువారం ఉదయం అవసరం నిమిత్తం ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు వెళ్లగా అప్పటికే ఏటీఎం మిషన్లో రూ.3 వేలు బయటకు వచ్చి ఉన్నాయి. వెంటనే వాటిని జగిత్యాల టౌన్ సీఐ నటేశ్‌కు అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు.

కూలీలు రూ.లక్షలు ఎలా చెల్లిస్తారు?

సారంగాపూర్(జగిత్యాల): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదవారి ఉచితంగా పట్టాలు అందించి ఇళ్లను నిర్మించే బాధ్యత పార్టీయే తీసుకుంటుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఒడ్డెరులు, రేచపల్లి దుబ్బగూడెంకు చెందిన గిరిజనులు, ఒడ్డెరులు ఎమ్మెల్సీకి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టాదారుల నుంచి భూమి కొనుగోలు చేసి ఇందిరమ్మ పథకం కింద దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇళ్లు నిర్మించుకున్నారని, 59 జీవో కింద రెగ్యులర్ చేయాలని దరఖాస్తు చేసుకుంటే లక్షల రూపాయలు చెల్లించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని ఎమ్మెల్సీ తప్పుబట్టారు. వారికి పొట్టగడవడమే కష్టంగా ఉందని, కూలీ చేసుకునే వారు లక్షల రూపాయలు ఎక్కడి నుంచి చెల్లిస్తారని ప్రశ్నించారు. రానున్నది కాంగ్రెస్ పార్టీయేనని ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు అందించడంతో పాటు అవసరమైతే ఇళ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ వెంట కాంగ్రెస్ నాయకులు ఎండీ ఇబ్రహీం, కోండ్ర రాంచంద్రారెడ్డి, బేర మహేష్, కొక్కు గంగారాం, కర్నె అంజిరెడ్డి, కాలగిరి మధుసూదన్, ఆకుల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

9వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న రామ్‌కుమార్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలకేంద్రానికి చెందిన మట్టెల రామ్‌కుమార్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మెట్‌పల్లిలోని ఓ ఆసుపత్రిలో యువకుడి కాలుకు శస్త్ర చికిత్స కోసం ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా గురువారం బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాడు. ఇప్పటికి 9 సార్లు రక్తదానం చేసినట్లు రామ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా అతడిని స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి

- ప్రజా ఆశీర్వాదయాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్



ప్రజా ఆశీర్వాదయాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్, నాయకులు

ధర్మపురి: కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందిందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా గురువారం ధర్మపురి పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించగా ప్రజలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత పాలకుల హయాంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని, సీఎం కేసీఆర్ గొప్ప ఆలోచనలతో విద్య, వైద్యం, నీరు, కరెంటు, సాగునీటికి కొదవలేకుండా ఉందని అందుకు కేసీఆర్ పాలనను తిరిగి తెచ్చుకోవాలని కోరారు. మేజర్ పంచాయతీగా ఉన్న ధర్మపురికి సరిపడా జనాభా లేకున్నా కేసీఆర్ ప్రత్యేక చొరవతో మున్సిపల్‌గా ఏర్పాటు చేశానని, అందుకు రూ.163 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. మంత్రిగా తాను ఏనాడు మురిసిపోలేదని, సాధారణ వ్యక్తిగా ప్రజలముందుకు వచ్చానని రానున్న ఎన్నికల్లో సేవచేసే భాగ్యం కల్పించాలని కోరారు. అనంతరం మంత్రి దంపతులు శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధితో ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రోజులే

పెగడపల్లి(ధర్మపురి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇబ్బందులు పడక తప్పదన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా మంత్రి వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి రైతులను ముప్పుతిప్పలు పెట్టిన ఆ పార్టీకి ఓటేస్తే రాష్ట్రంలో చీకటి రోజులు వస్తాయన్నారు. అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్నాయన్నారు. కార్యక్రమాల్లో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీలు చిట్టిబాబు, శోభ, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, రాజేందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా పేరు తొలగించొద్దు



అభివాదం తెలుపుతున్న నాయకులు

- జమిలి ఎన్నికలు సరికాదు
- ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశం పేరును ఇండియాగా తొలగించి భారత్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల మూడో వారంలో పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి రాజ్యాంగ సవరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాజ్యాంగంలో ఇండియా.. అలాగే భారత్ గాను దేశం పేరును వాడుకలో ఉంచేలా రాజ్యాంగంలో పొందుపర్చారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జమిలి ఎన్నికల అంశాన్ని బీజేపీ వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చిందన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు బీఎస్పీ వ్యతిరేకమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీల ప్రాబల్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతోనే జమిలి అంశాన్ని ముందుకు తెచ్చారని అన్నారు. ఆయన వెంట నాయకులు దాసరి హనుమయ్య, దాసరి ఉష, రాజు, వెంకటేశ్, రియాజ్ తదితరులున్నారు.

మంత్రి చేసిన అభివృద్ధి శూన్యం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పాదయాత్రలో లక్ష్మణ్‌కుమార్, నాయకులు

పెగడపల్లి(ధర్మపురి): ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధి శూన్యమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా గురువారం పార్టీ శ్రేణులతో కలిసి పెగడపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెగడపల్లి, వెంగళాయిపేట గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలిచ్చి నెరవేర్చకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారం కోసం దళితబంధు, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని మోసం చేయడం తప్ప మరొకటి లేదని, ప్రజలు వాటిని నమ్మొద్దని కోరారు. చొప్పదండి, సిద్దిపేటలో ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షలు చెల్లిస్తే, ఇక్కడ ఎకరాకు రూ.7 లక్షలు మాత్రమే చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. కాళేశ్వరం లింక్– 2 ప్రాజెక్టు మేఘా కంపెనీ పనుల్లో సీఎం కేసీఆర్‌కు 75 శాతం, మంత్రి ఈశ్వర్‌కు 25 శాతం వాటా ఉందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే రూ. 500కే గ్యాస్ సిలిండర్, రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు, అర్హులకు రూ.4 వేల పింఛన్, అంబేడ్కర్ అభయ హస్తం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షల ఆర్థికసాయం, నిరుపేదల ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు, పంట రుణం రూ. 2 లక్షలు మాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, తిరుపతి, కిషన్, రాజేందర్, ప్రశాంత్, గంగాధర్, విజయభాస్కర్, రామాగౌడ్, రాజేశంగౌడ్, రవి, సత్యనారాయణరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతిని విడదీసే కుట్రలు సాగనీయం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పాదయాత్రలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నాయకులు

జగిత్యాలటౌన్: జాతిని విడదీసే కుట్రలను చిత్తు చేసి, దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడోయాత్ర చేపట్టి ప్రజలను చైతన్యపరిచారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. భారత్ జోడోయాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులతో ఎమ్మెల్సీ పాదయాత్ర చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాదయాత్రలో భాగంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ తన భారత్ జోడోయాత్రతో దేశ ప్రజలకు శాంతి సందేశం అందించగా, మోదీ దేశ ప్రజలను విభజించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. భారత్ పేరుతో మోదీ రాజకీయాలకు తెరతీయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్యాస్ సిలిండర్ రూ.500కే అందజేస్తామన్నారు. తెలంగాణ ఏర్పాటుతో సామాన్యులకు న్యాయం జరగలేదని, రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక తెలంగాణ లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నేహాల్, గుండ మధు, రఘువీర్‌గౌడ్, చందా రాధాకిషన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కాంగ్రెస్‌లో చేరుతున్నవారికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ ప్రేక్షక పాత్రను నిరసిస్తూ బీఆర్ఎస్ జగిత్యాల రూరల్ మండల ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి గంగారెడ్డి, తన స్నేహితులు, యువకులతో కలిసి గురువారం ఎమ్మెల్సీ సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని కోరారు. పడిగెల శ్రీనివాస్, దుంపల ఈశ్వర్‌రెడ్డి, వంగ రాజు, కంచి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

రేచపల్లిలో మామిడి మొక్కలు ధ్వంసం



ధ్వంసమైన మామిడి మొక్కలను పరిశీలిస్తున్న గ్రామస్తులు, ధ్వంసమైన మొక్క (ఇన్‌సెట్‌లో)

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రేచపల్లిలో ముగ్గురు మహిళా రైతులకు చెందిన మామిడి మొక్కలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామస్తుల వివరాలు.. రేచపల్లి గ్రామానికి చెందిన రేండ్ల లక్ష్మి, రేండ్ల పుష్ప, రేండ్ల సరిత భర్తలు ముంబయిలో కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారు ముంబయి వెళ్లడంతో వరిపొలాలు సాగుచేయడం ఇబ్బందిగా మారింది. దీంతో మామిడి మొక్కలు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. 15 రోజులుగా భూమిని చదును చేసి, గుంతలు తవ్వి 360 మామిడి మొక్కలు (రెండున్నర సంవత్సరాల వయస్సు గల మొక్కలు) నాటారు. పైప్‌లైన్లు, డ్రిప్ సైతం ఏర్పాటు చేయించుకున్నారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి ప్రవేశించి విచ్చలవిడిగా మా మిడిమొక్కలను, పైప్‌లైన్లు, డ్రిప్‌ను ధ్వంసం చేశా రు. తమకు లక్షల రూపాయల నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..



సారంగాపూర్(జగిత్యాల): ఇటీవల వర్షాలకు మండలంలోని కోనాపూర్ అప్రోచ్ రోడ్డు భారీగా కోతకు గురైంది. అయినా వాహనదారులు దూర భారం తగ్గుతుందని, ప్రమాదం అని తెలిసినా ఆ రోడ్డు మీదుగా వెళ్తున్నారు. ప్రభుత్వం ఇక్కడ హైలెవల్ వంతెన పనులు చేపట్టగా పూర్తి కాలేదు. ప్రత్యామ్నాయంగా జన్నారం నుంచి బీర్‌పూర్, సారంగాపూర్ మీదుగా జగిత్యాలకు వచ్చేలా ఆరు నెలల క్రితం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈసారి వర్షాలు మొదలైనప్పటి నుంచి ఈ రోడ్డు పలుమార్లు కొట్టుకుపోగా అధికారులు మరమ్మతు చేశారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మళ్లీ సగం వరకు కొట్టుకుపోగా అధికారులు మరమ్మతు చేయలేదు. వర్షాలు తగ్గిన తర్వాత పూర్తి మరమ్మతులు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

మోసం జరిగిందని మొత్తుకుంటే.. విమర్శించడమేంటి?



మాట్లాడుతున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): దళితబంధు డబ్బులను అధికార పార్టీ ప్రజాప్రతినిధి కాజేశారని బాధితులు మొత్తుకుంటే.. ప్రతిపక్షాలను జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు విమర్శించడం వింతగా ఉందని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు తుల ఉమ మండిపడ్డారు. గురువారం మేడిపెల్లి, కథలాపూర్ మండలాల్లో పర్యటించిన ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితబంధు పథకం లబ్ధిదారులకు యూనిట్ నెలకొల్పడంపై అవగాహన కల్పించడం అధికారులదే బాధ్యత అని అందరికి తెలుసునన్నారు. అలాంటిది ఓ ప్రజాప్రతినిధి ఏకంగా దళితబంధు లబ్ధిదారుల వద్ద డబ్బులు తీసుకొని పనులు చేయిస్తామని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. దళితబంధు ద్వారా వచ్చిన డబ్బుతో జెడ్పీ వైస్‌చైర్మన్ స్పైసీ యూనిట్ ఏర్పాటు చేయిస్తామని మోసం చేసినట్లు బాధితులే తమతో చెప్పారని, దీంతో తాము సదరు యూనిట్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించామని వివరించారు. దళితబంధు డబ్బులు అక్రమంగా కాజేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధే తప్పును కప్పి పుచ్చుకోవడానికి ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాధితులను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే సహించబోమన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి మేడిపెల్లి మండలంలో దళితబంధు డబ్బులు అసలైన లబ్ధిదారులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట నాయకులు ఎండీ ఎక్బాల్, శ్రీరాముల ప్రకాశ్, మేడిపెల్లి గంగాధర్ ఉన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు రామానుజమ్మ



సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన టమటం రామానుజమ్మ(70) అంతర్జాతీయ స్థాయిలో జరిగే మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు హాజరుకానుంది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 16, 17 తేదీల్లో జరిగే 35వ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది. 50 కిలోలు.. 70 ఏళ్ల విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెంలో తలపడనుంది. ఇటీవల హర్యానాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించింది. జాతీయస్థాయిలో 70 ఏళ్ల విభాగంలో రాణించిన రామానుజమ్మను అంతర్జాతీయ పోటీలకు దేశం తరఫున ఎంపిక చేసినట్లు నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఇండియా సెక్రటరీ జనరల్ రాంపాల్‌శర్మ గురువారం ప్రకటించారు. పరుగు పందెంలో అంతర్జాతీయ పోటీలకు ఎంపికవడంపై రామానుజమ్మ మాట్లాడుతూ తనకు సహకరించిన తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు మర్రి లక్ష్మారెడ్డి, ప్రభుకుమార్‌గౌడ్, కల్లెం మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చీటీ నర్సింగరావు, కార్యదర్శి గొట్టిముక్కుల శేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సిరిసిల్ల వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతిని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న హరిచరణ్‌రావు

మేడిపెల్లి(వేములవాడ): దేశాయిపేట దళితబంధు యూనిట్ పై ప్రతిపక్షాలు కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి ఓట్లడిగే ముఖం లేకనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. గురువారం దేశాయిపేట దళితబంధు యూనిట్ వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దళితబంధు పథకంలో భాగంగా మొదటి విడతలో మేడిపెల్లి మండలానికి 15 యూనిట్లు రాగా అందులో ఐదింటిని కలిపి స్పైసెస్ యూనిట్ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అండగా ఉండాలని అనుకున్నామని, అంతలోనే అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించడం తగదన్నారు. యూనిట్ ఏర్పాటులో భాగంగా మిషనరీ, సిమెంట్, భారీ షెడ్డు నిర్మాణానికి, తదితర పనులకు రూ.29 లక్షలు ఖర్చయ్యాయని, ప్రతిపైసా లెక్కలు చూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అవినీతిని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. దళితులకు మేలు చేసే ఉద్దేశం ఉంటే సలహాలు ఇవ్వాలని, ఇలా ఇతరుల మనోభావాలు దెబ్బ తీయొద్దని కోరారు.


స్పైసెస్ యూనిట్‌తో ప్రయోజనంలేదు

జెడ్పీ వైస్ చైర్మన్ మీడియా సమావేశం అనంతరం బాధితులు విలేకరులతో మాట్లాడారు. స్పైసెస్ యూనిట్‌తో తమకు ఎలాంటి ప్రయోజనం లేదని ఇప్పుడే ఇలా ఉంటే ముందు ఇంకెలా ఉంటుందోనని వాపోయారు. కనీసం ఇప్పటికైనా తాము ఎంచుకున్న యూనిట్‌లు ఇవ్వాలని కోరారు. స్పైసెస్ యూనిట్‌ను ఇతరులకు ఇచ్చుకోవాలని, సదరు యూనిట్‌తో తాము లబ్ధి పొందుతామనే నమ్మకం లేదని మీడియా ఎదుట వాపోయారు.

బంగారు గొలుసు చోరీ

పెగడపల్లి(ధర్మపురి): పెగడపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 80 ఏళ్ల వయస్సు గల బైర మల్లవ్వ రేకుల షెడ్డులో ఒంటరిగా నిద్రిస్తుండగా, అర్ధరాత్రి దొంగ ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న తులం బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. గురువారం మల్యాల సీఐ కోటేశ్వర్, కొడిమ్యాల ఎస్సై వెంకట్‌రావు, ఏఎస్సై సత్తయ్య, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరుపై బాధితురాలిని సీఐ అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీజేపీ టికెట్ల కోసం దరఖాస్తులు



దరఖాస్తు అందజేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

జగిత్యాలజోన్: జగిత్యాల నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం జిల్లా రైతు ఐక్యవేదిక మాజీ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి గురువారం పార్టీ నాయకులు, తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బీజేపీ నాయకులు వీరబత్తిని అనిల్‌కుమార్, గడ్డం రాంరెడ్డి, మ్యాడ జనార్దన్, ముత్యంరెడ్డి, రవీందర్, లక్ష్మీనారాయణ, జున్ను రాజేందర్, ఆముద రాజు, రాజన్న, గంగారాం, పాల్గొన్నారు.

'చొప్పదండి' టికెట్ కోసం..

కొండగట్టు(చొప్పదండి): చొప్పదండి నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయపల్లి గ్రామానికి చెందిన గోల్కొండ రాజు గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. ఆయన వెంట సంజీవ్ తదితరులు ఉన్నారు.

'కోరుట్ల' టికెట్ కోసం..

మెట్‌పల్లి(కోరుట్ల): కోరుట్ల అసెంబ్లీ బీజేపీ టికెట్ కోసం గురువారం పలువురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం గంగాధర్, కౌన్సిలర్ మర్రి పోచయ్య దరఖాస్తులు అందజేశారు.

'ధర్మపురి' స్థానానికి..

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ కోసం దూడ మహిపాల్ గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాడు. పార్టీ ఆదేశిస్తే బీజేపీ నుంచి బరిలో ఉంటానని పేర్కొన్నారు.

అనుమల్ల కృష్ణహరి దరఖాస్తు..

జగిత్యాలటౌన్: జగిత్యాల అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అవకాశం కల్పించాలని బీజేపీ నాయకుడు అనుమల్ల కృష్ణహరి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గురువారం దరఖాస్తు సమర్పించారు. ఆయన వెంట పలువురు నాయకులు, న్యాయవాదులు ఉన్నారు.